క్లుప్తంగా

దుస్తుల పంపిణీ

మధిర: మధిర పట్టణంలో ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాత బట్టల కేంద్రం నుంచి నిరుపేద పిల్లలకు ఆదివారం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాతల నుంచి సేకరించిన పాత బట్టలను ప్రతి ఆదివారం నిరుపేద పిల్లలకు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ బట్టలను విశ్రాంత ఉపాధ్యాయులు యంద్రపల్లి పద్మావతి, తూములూరు సింధు, టైలర్ బెనర్జీ, తపాలా ఉద్యోగి శివ తదితరులు వితరణ చేశారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చింతకాని: మండలంలోని నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఆ విద్యార్థులు పాఠశాలలో సమావేశమై ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు జి.రమేష్, ఇందిరాసరస్వతి, సోందుసాహెబ్, రజినీని శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమరబోయిన సురేష్, చింతా శంకర్‌బాబు, చంద్రశేఖర్, నెల్లూరి అనూష తదితరులు పాల్గొన్నారు.

వనసమారాధన


మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు గాంధీ

తల్లాడ: తల్లాడ పట్టణంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు ఆకుల గాంధీ మాట్లాడుతూ.. మున్నూరుకాపులంతా ఐక్యంగా తమ సమస్యలు, హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఈ సందర్భంగా వారు రోజంతా వనంలో గడిపి.. భోజనాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాసరావు, కె.నర్సయ్య, వై.రామ్‌ప్రసాద్, హనుమంతురావు, మల్లాల ప్రసాద్, సుందర్‌రాజు, నాగేశ్వర్‌రావు, కోసూరి వేలాద్రి, రాధాకృష్ణ, కోటగిరి ప్రవీణ్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, గోవింద్ శ్రీనువాసరావు, దుగ్గిదేవర వెంటలాల్, కటికి నరసింహారావు, కటికి కిరణ్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి


ఇరుముడి ధరిస్తున్న అయ్యప్ప స్వాములు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామంలోని శివాలయంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారణ చేపట్టిన 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో దీక్ష చేసిన స్వాములకు గురుస్వామి ఆలస్యం వెంకయ్య ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి భక్తి పాటలను ఆలపిస్తూ ఇరుముడితో గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన స్వాములు శబరిమలకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

సాయి మాలధారుల బిక్షాటన

పెనుబల్లి: గురుస్వామి బొర్రా శ్రీనివాసరావు సాయి ఆధ్వర్యంలో షిరిడిసాయి మాలధారులు గ్రామంలో బిక్షాటన చేశారు. కార్యక్రమంలో గురు స్వామి బొర్రా శ్రీనివాసరావు సాయి, మాలదారులు మురళి, రామారావు, లక్ష్మణ్, శ్రీనివాసరావు, రాంబాబు, రఘుసాయి హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి నివాళి

వైరారూరల్: మండలంలోని గన్నవరం మాజీ ఎంపీటీసీ శీలం జనార్దన్‌రెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, మాగంటి తిరుమలరావు, శీలం వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మల్లయ్య తదితరులు పూలమాలలతో నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కొత్త రేషన్ కార్డుల జాడేది?

- అర్హులకు అందని సంక్షేమ పథకాలు
- ఏళ్లుగా కొత్త కార్డులకు నోచుకోని వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



వైరారూరల్: కొత్త ఆహార భద్రత కార్డుల జారీ ప్రక్రియ దరఖాస్తులకే పరిమితమైంది. వీటి కోసం దరఖాస్తులు చేసి ఏళ్లు గడుస్తున్నా.. కార్డులు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు మీసేవా కేంద్రాలు, తహసీల్ చుట్టూ తిరుగుతున్నారు. కొత్త కార్డుల మంజూరులో గత ప్రభుత్వం తీవ్ర జాప్యంగా వ్యవహరించిన నేపథ్యాన అర్హత ఉన్న పలువురికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని పరిస్థితి నెలకొంది. ఒక్క పూట భోజనం చేసేందుకు అవసరయమ్యే బియ్యం కోసం ఆరాటపడే వారు కొందరైతే మరో వైపు ప్రభుత్వ పథకాలు, వైద్యానికి తాపత్రయ పడే వారు మరి కొందరు. కార్డుల జాప్యంతో అవస్థలు పడుతున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల అనంతరం అప్పటి ప్రభుత్వం కొత్త కార్డులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ప్రభుత్వ పదవీకాలం తీరిన లబ్ధిదారులు మాత్రం కొత్త కార్డులకు నోచుకోలేకపోయారు. ప్రతి సంక్షేమ పథకానికి రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో మండలంలో దరఖాస్తు చేసుకున్న వేలాది మంది ఏళ్ల తరబడి ఆహారభద్రత కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు.

నూతన ప్రభుత్వంపై ఆశలు..

ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీలను ప్రవేశపెట్టడమే కాకుండా ఇప్పటికే రెండు పథకాలను అమలు చేసింది. ఇదే సమయంలో గత కొన్ని రోజుల క్రితం పౌరసరఫరాల శాఖ మంత్రి కొత్త ఆహారభద్రత కార్డుల ప్రక్రియ మీద సమీక్ష నిర్వహించిన నేపథ్యాన ఈ ప్రభుత్వమైన ఆహారభద్రత కార్డులను మంజూరు చేసి తమను సంక్షేమ పథకాలకు అర్హత కల్పిస్తుందని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలో ఇలా..

వైరా మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలు ఉండగా మరో 3 శివారు గ్రామాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా మొత్తం 29 చౌకదుకాణాలు ఉండగా ఆయా దుకాణాల పరిధిలో 15,983 రేషన్ కార్డులు ఉన్నాయి. మరో 3,726 ఆహారభద్రత కార్డులో పెండింగ్ ఉన్నాయి. వీటిలో 1,636 మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా 1,890 మంది రేషన్ కార్డులో తమ పేర్లను జతపర్చుకునేందుకు.. అదే విధంగా మరో 200 మంది లబ్ధిదారులు పేర్లలో మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకొని మీ సేవా కేంద్రాలు, తహసీల్ చుట్టూ ఏళ్ల తరబడి చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

అన్నింటికీ తెల్లరేషన్ కార్డే ప్రామాణికం..

ఆరోగ్యశ్రీ సేవలకు, ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలో ఉపకార వేతనాలు పొందడానికి ఆదాయ, ఇతర ధృవీకరణ పత్రాలకు తెల్లరేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహాలక్ష్మి ఇతర సంక్షేమ పథకాలకు ఈ ఆహార భద్రత కార్డే ప్రామాణికంగా మారుతుందని పుకార్లు చక్కర్లు కొడుతున్న నేపథ్యాన ఆహార భద్రత కార్డులు లేని పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయో లేదో అనే సందిగ్ధంలో ఉన్నారు. కొత్త కార్డులు, పాత కార్డులలో మార్పుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని కొన్నేళ్లుగా పేదలు కార్డుల కోసం పడిగాపులు కాస్తున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న వారు కుటుంబాల నుంచి విడిపోయిన వారు ఎప్పుడు కొత్తకార్డులు వస్తాయా.. అని ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వం కార్డుల మంజూరు జాప్యంగా వ్యవహరించిన నేపథ్యాన పలువురు లబ్ధిదారులు కల్యాణ లక్ష్మీ, ఉపకారవేతనాలు, ఆరోగ్యశ్రీ, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు తదితర సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోయినట్లు తెలుస్తోంది.

వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదు..



నాకు వివాహం జరిగి మూడేళ్లు అయ్యింది. అప్పటి నుంచి ఆహారభద్రత కార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు మీసేవా కేంద్రాలు, తహసీల్ చుట్టూ తిరిగినా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకపోవడంతో.. పలువురు మీ సేవా నిర్వాహకులు వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారు. దీంతో ఆహారభద్రత కార్డు కోసం మేమంతా పడిగాపులు కాయాల్సి వస్తుంది.

– గరిడేపల్లి జగదీష్, విప్పలమడక

కొత్త కార్డులు మంజూరు చేయాలి.



రేషన్ కార్డు లేనందున పలు రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకోవాలంటే సమస్యలు తలెత్తున్నాయి. ప్రభుత్వం ప్రతి నెల అందించే బియ్యానికి కూడా నోచుకోలేకపోతున్నాం. ప్రభుత్వ పథకాలను రేషన్ కార్డు తప్పనిసరి కావడంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి కొత్త ఆహారభద్రత కార్డులకు మార్గదర్శకాలు విడుదల చేయాలి.

– మాతంగి రాము, వైరా

పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలి


పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలంలో ఆందోళన చేస్తున్న రైతులు

కొణిజర్ల: పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి తమ వద్ద భూములు తీసుకుని తమకు ఇవ్వవలసిన నష్టపరి హారం ఇవ్వలేదంటూ రైతులు ఆందోళన చేపట్టిన సంఘటన మండలంలోని అంజనాపురం పంచాయతీలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకా రం.. కొణిజర్ల మండలం అంజనాపురం, గద్దల గూడెం పంచాయతీల పరిధిలోని గోద్రేజ్ కంపెనీ వారిచే పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం సుమారు 115 ఎకరాల అసైన్డ్ భూమి సేకరించారు. ఈ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఎకరానికి రూ.27 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పి కేవలం రూ.20 లక్షలే ఇచ్చారని మిగిలిన డబ్బు దాదాపు నాలుగు నెలలు కావస్తున్నా ఇవ్వలేదని సదరు భూముల రైతులు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. తమకు తెలియకుండా తమ వద్ద సంతకాలు తీసుకుని ప్రైవేట్ కంపెనీకి అప్పగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు నిలిపివేయాలని.. తమకు రావాల్సిన డబ్బులు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొణిజర్ల ఎస్సై జె.శంకరరావు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపి రైతులతో మాట్లాడించారు. ఈ విషయంపై తహసీల్దార్, కలెక్టర్లతో మాట్లాడుకోమని చెప్పగా రైతులు ఆందోళన విరమించి సోమవారం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడానికి నిర్ణయించారు.

మెడికల్ కళాశాలకు శరీరదానం


మహాలక్ష్మి(ఫైల్)

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లికి చెందిన దారా మహాలక్ష్మి(87) శనివారం రాత్రి మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యాన ఖమ్మం మమత మెడికల్ కళాశాలకు ఆదివారం దానం చేశారు. కార్యక్రమంలో దారా కృష్ణారావు, దారా నాగేశ్వర రావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దొడ్డా కృష్ణయ్య, జగన్మోహన్ రావు కొత్తూరు సత్యనారాయణ ఉన్నారు.

నిరుపేద విద్యార్థికి సాయం


శ్రీనివాసతేజకు చెక్కు అందజేస్తున్న భావన

వైరా: వైరాకు చెందిన ఓ నిరుపేద విద్యార్థి మేము న్నాము స్వచ్ఛందసంస్థ వారు రూ.70 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైరాకు చెందిన కొడుమూరి శ్రీనివాసతేజ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించాడు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున చదువు కొనసాగించలేక పోతున్నాడనే విషయం తెలుసుకున్న మేము న్నాము స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు గందం భావన ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు చంద్ర తులసి, సింగు బద్రి, జయంత్, రంగా కమల్, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి వితరణ..


శ్రీను కుటుంబ సభ్యులకు బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొణిజర్ల: మండలంలోని మల్లుపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాలోత్ శ్రీను కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు క్వింటా బియ్యం వితరణ చేశారు. వారం క్రితం శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబం అత్యంత నిరుపేద కుటుంబం కావడంతో నాయకులు రూ.5 వేలు విలువగల క్వింటా బియ్యాన్ని కర్మల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాపోలు వెంకన్న, ధర్మసోత్ కోటేష్, ఓర్సు సురేందర్, గుగులోత్ కళావతి, బానోత్ నవీన్, నరసింహారావు, వీరన్న, మాధవరావు, నరేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వడ్డెర సంఘం..


రూ.5 వేలు నగదు అందిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలో ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సీనియర్ బీజేపీ కార్యకర్త బండారు వెంకటేశ్వర్లు (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆధ్వర్యాన రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.10వేలు..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ద్వారకాపురి కాలనీలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి ఆదివారం రూ.10వేలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో శీలపురెడ్డి బాలకృష్ణారెడ్డి, విష్ణు, సురేష్ పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోక పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మధిర: మధిర పట్టణంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోక పోటీల్లో మధిర భరత్ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటిప్రథమ, ద్వితీయ, ప్రోత్సాహక బహుమతులను సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత శీలం విద్యాలత వెంకటరెడ్డి విద్యార్థులు అన్విత, జాహ్నవి, తపస్వి, సంగీత లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వర రావు, ఉపాధ్యాయులు ఉమ, రవీందర్ రెడ్డి, స్రవంతి, నాగరాజు, పద్మజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో..


బహుమతి అందుకుంటున్న హర్షిత్

సత్తుపల్లిరూరల్: విజయవాడలో ఆదివారం జరిగిన 14వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తుపల్లి టాలెంట్‌స్కూల్ 4వ తరగతి విద్యార్థి డి.హర్షిత్ కటా విభాగంలో ప్రథమ స్థానం సాధించాడు. మెడల్‌తో పాటు సర్టిఫికెట్లను ద్రోణారత్న అవార్డు గ్రహీత బ్రహ్మానందరావు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా హర్షిత్‌ను పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పిలి అరుణ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ చీకటి భారవి

వైరా: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ చీకటి భారవి, బోడేపూడి కళానిలయం సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ప్రతినెల వైద్య శిబిరంలో భాగంగా వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. రానున్న బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పిల్లలమర్రి సుబ్బారావు, సుంకర సుధాకర్, బొంతు సమత, గుడిమెట్ల రజిత, మాదినేని రజని, అనుమోలు రామారావు, మోహనరావు, నారాయణరెడ్డి, చలపతిరావు, సత్యనారాయణ, ప్రసాద్, ఉదయ్, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా


మాట్లాడుతున్న ఎంపీ బండి పార్థసారధిరెడ్డి, పక్కన సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి/వేంసూరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటానని ఎంపీ బండి పార్థ సారధిరెడ్డి అన్నారు. ఆదివారం వేంసూరు మండలం కందుకూరులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో పని చేయటం నా రక్తంలోనే ఉందని, మన ప్రయత్నం లోపం లేకుండా పనిచేశాం.. గెలుపోటములు సహజమన్నారు. సత్తుపల్లిలో క్యాంప్ కార్యాలయం ఏర్పాటు చేసి సమయం ఉన్నప్పుడల్లా మిమ్మల్ని కలుస్తానని.. మీరందరు ధైర్యంగా ఉండాలన్నారు. ఎన్నికల్లో 91 గ్రామాల్లో ప్రచారం చేశానని, కార్యకర్తలు, నాయకులు చూపించిన ప్రేమ జీవితంలో మర్చిపోలేనన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో గెలుపోటములు సహజమని ఎవరూ అధైర్యపడొద్దని మన ఎంపీ పార్థసారధిరెడ్డి మనందరికీ అందుబాటులో ఉండి మరిన్నీ సేవా కార్యక్రమాలు చేపడతారన్నారు. ఎన్నికల సమయంలో ఎంపీ బండి చేసిన ప్రచారానికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వర రావు, లక్కినేని అలేఖ్య, చెక్కిలాల మోహన్‌రావు, కె.రామారావు, పాలెపు రామారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, ఎస్‌కె రఫీ, మోదుగు పుల్లారావు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వించండి


ఎమ్మెల్యే మట్టా రాగమయికి వినతిపత్రం అందజేస్తున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలను అరికట్టి, పోడు భూములకు పట్టాలిప్పించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని గిరిజనులు కోరారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆదివారం సీపీఐ ఆధ్వర్యాన సత్తుపల్లి మండలం చెరుకుపల్లి పంచాయతీలోని తుమ్మలనగర్ గిరిజన పోడు సాగుదారులు కలిసి వినతిపత్రం అందించారు. 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల్లో అటవీఅధికారులు దౌర్జన్యం చేసి గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, గడ్డం కృష్ణయ్య, దారబోయిన రాజు, తాటి రాజులు పాల్గొన్నారు. అనంతరం గుడిపాడు పెద్దమ్మతల్లి, అయ్యగారిపేట ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా సత్తుపల్లికి చెందిన సోమరాజు మధురాబాయి మృతి చెందగా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వాస్పత్రి కార్మికులు, మధ్యాహ్నభోజన కార్మికులు కలిసి తమ సమస్యలు ఎమ్మెల్యేకు వివరించారు.

విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అధికారులు

వైరా: మధిర సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులకు పునఃశ్చరణ తరగతుల ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైరాలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో జిల్లా ఎస్సీ కులాల ఉప సంచాలకుడు కస్తాల సత్యనారాయణ, డివిజన్ ఏసీడీ కొత్తా వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. భవిష్యత్‌కు పదో తరగతి పునాది అని.. విద్యార్థులు పునఃశ్చరణ తరగతులను సద్వినియోగం చేసుకుని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ తరగతుల్లో సైన్స్, ఆంగ్లం, గణితం, హిందీ, సైకాలజీ లలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ వసతి గృహాల సంక్షేమాధికారులు మెట్టు వీరన్న, జంగం వేణు, తేజావత్ దశరథ్, బేగం, హసీనా, కృష్ణవేణి, శ్రీధర్, సలీమ్, ప్రభాకర్, మల్లారెడ్డి, కృష్ణవేణి, వరలక్ష్మి, ధనలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కల్లూరు: రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఖమ్మం మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ సౌజన్యంతో ఆదివారం విజ్ఞాన్ విద్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. తగిన సలహాలు, సూచనలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి నెల 3వ ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు వేల్పుల కృష్ణయ్య, కార్యదర్శి కడియాల ఫ్రాన్సిస్, కట్టా కోటయ్య, శివ రామకృష్ణ, అబ్దుల్ లతీఫ్, విజ్ఞాన్ విద్యాలయం కరస్పాండెంట్ ఎస్‌కే ఇస్మాయిల్, ఉబ్బన పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు..


స్వామివార్లకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

తల్లాడ: తల్లాడలోని కొత్తగూడెం రోడ్డులో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం నాలుగో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభించారు. తణుగుల మణికంఠ శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం మంగళ తోరణం, గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి, మహా గణపతికి అభిషేక పూజలు జరిపించారు. పంచామృతాలతో భక్తులు అభిషేకం చేయగా స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా వల్లీదేవీ సమేత సుబ్రహ్మణ్యస్వామి వార్లకు పలు రకాల పుష్పాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, గోపూజ, యాగశాల హోమం నిర్వహించారు.

కోటమైసమ్మ దేవాలయంలో..

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొత్తలంక కైలాసశర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వాహన పూజలు జరిపించుకున్నారు. పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పర్స పట్టాభి రామారావు, దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాసచార్యులు, సిబ్బంది మోహన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు..


ధనుర్మాస పూజల్లో పాల్గొన్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీత జ్ఞానమందిరంలో గల శ్రీపార్థసారధిస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు శ్రీవేంకటేశ్వర శరణాగతి దీక్షలు చేపట్టారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు చైతన్యస్వామి మొదటి పాశురాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపూరి పురిషోత్తం, తాటికొండ వెంకటేశ్వర రావు, నాగుబండి భాస్కర్‌రావు, నడిపల్లి సత్యావతి, కొనకళ్ల శారద, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

పెనుబల్లి: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కొలికపోగు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని వియంబంజర్ అరుణోదయ మెరిట్ స్కూల్ ఆ సంఘం మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం కోసం మాదిగలంతా మరో మారు ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన హడక్ కమిటీ ఏర్పాటు చేశారు. మండల గౌరవ సలహాదారులుగా జజార్లపు పుల్లయ్య, మరకాల శ్రీను, తేళ్లూరి ఆంజనేయులు, మరకాల వెంకటేశ్వరరావు, గొల్లమందల పిరయ్య, మండల కన్వీనర్‌గా జొన్నలగడ్డ రామకృష్ణ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రభు, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కొలికపోగు రామకృష్ణలతో పాటు మరి కొంత మందితో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పుల్లయ్య, రామకృష్ణ, రాజరత్నం, ముత్తారావు, ప్రభు, ఆంజనేయులు, రామకృష్ణ జోగరావు తదితరులు పాల్గొన్నారు.